క్లుప్తంగా

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



దస్తగిరి స్వామి దర్గా

కౌతాళం : మండల పరిధిలోని ఎరిగేర గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 5గంటలకు గంధం వేడుకలు నిర్వహించారు. అనంతరం ఉరుసు ఉత్సవం కోసం ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు చేశారు. గ్రామస్తులే కాక చుట్టు పక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారు జామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి షెక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్ల సమాధులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి ఉదయం నైవేద్యం సమర్పించారు. నిర్వాహకులు దర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డి సాయి బాబా ఆలయాన్ని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రముఖ న్యాయవాది మృతి



యశస్వీ (ఫైల్)

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ప్రముఖ న్యాయవాది యశస్వీ(50) గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. స్థానిక ఎస్‌కేడీ కాలనీ ప్రభుత్వ బాలికల కళాశాల సమీపంలో నివాసముంటున్న యశస్వీ గురువారం విధులు ముగించుకొని ఇంటికి వచ్చి ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, కుమారుడు ఉన్నారు. అడ్వకేట్ మృతిపట్ల తోటి న్యాయవాదులు, ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుటుంబీలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌కు అవార్డు



డ్రైవర్ రాయుడుకు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీలో 29 ఏళ్లు డ్రైవర్‌గా పని చేస్తూ ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని ఎమ్మిగనూరు డిపో డ్రైవర్ ఎస్.రాయుడు జిల్లాలో రెండవ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ డీపీటీఓ శ్రీనివాసులు నుంచి ఆయన అవార్డు పొందారు.దీంతో గురువారం స్థానిక డిపోలో ఆయనకు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పంపయ్య ప్రోత్సాహక చెక్కు అందజేశారు. డిపో మేనేజర్ అమర్నాథ్‌తో పాటు నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ అభినందించారు.

21న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో వెలసిన హజరత్ బాబా సాహెబ్ తాత ఉరుసు సందర్భంగా ఈనెల 21వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. విజేతలకు వరుసగా.. రూ.20,016వేలు, రూ.10,016వేలు, రూ. 5,016వేలు అందజేస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీ ఫీజు ఈనెల 20వ తేదీలోపు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 7013058360, 9381646949 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు హరినామ సంకీర్తన ఉత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో హరినామ సంకీర్తన ఉత్సవం నిర్వహించనున్నట్లు సెంటర్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు హరినామ జపయజ్ఞం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

- రూ.82.80లక్షలతో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు
- నాడు–నేడు కింద రూ.1.92 కోట్లతో పాఠశాలలకు మహర్దశ
- రూ.30లక్షలతో కొండ ప్రాంతానికి రోడ్డు వసతి
- రూ. కోటితో దుద్ది, కొల్మాన్‌పేట గ్రామాల్లో వాడ వాడలా రోడ్డు
- డీబీటీ, నాన్ డీబీటి కింద మొత్తం రూ.30కోట్లు ఖర్చు



గ్రామంలో నిర్మించిన రైతు భరోసా



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

దుద్ది.. అభివృద్ధి



దుద్ది గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం

కోసిగి: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పంచాయతీలు అభివృద్ధి బాట పట్టాయి. గ్రామాల్లో ఇంటి వద్దకే సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చారు. ప్రజలు మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామాల్లో సేవలు అందించేందుకు సచివాలయం, రైతులకు విత్తనాలు నుంచి పంట దిగుబడి కొనుగోలు వరకు రైతు భరోసా కేంద్రాలు, వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలలను కార్పొరేటుకు తీర్చి దిద్దారు. సచివాలయం, గడప గడప నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే మండలంలోని దుద్ది గ్రామంలో రూ.40లక్షలుతో సచివాలయం, రూ.21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించి ప్రజలకు గ్రామాల్లోనే సవలు అందిస్తున్నారు.

కొండప్రాంత ప్రజలకు తప్పిన కష్టాలు

గ్రామంలోని కొండ ప్రాంతాల్లో గృహాలు, గ్రామదేవతలు మారెమ్మ దేవి, దేవమ్మ దేవి ఆలయాలు ఉన్నాయి. కొండల్లో రాళ్ల మధ్యలోనే ప్రజలు నడుచుకుంటు వెళ్లతూ తీరని ఇబ్బందులు పడ్డారు. గ్రామ ప్రజలు గత ఎన్నికల్లో కొండ ప్రాంతానికి రోడ్డు వసతి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తనయుడు యువనేత వై.ధరణీధర్ రెడ్డిని కోరారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఏడాది క్రితం ఎమ్మెల్యే నిధులు రూ. 30లక్షలు వెచ్చించి కొండ ప్రాంతానికి సీసీ రోడ్డు వేయించారు.

➤ ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం, ఎమ్మెల్యే, ఎంపీ గ్రాంటులతో కలిసి కొల్మాన్‌పేట, దుద్ది గ్రామంలో రూ.కోటి తో వాడ వాడల సీసీ రోడ్డు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు.

➤ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను 10వ తరగతి వరకు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. నాడు–నేడు రెండవ విడుత కింద రూ.1.92కోట్లు బడ్జెట్ కేటాయించారు. ఇందులో 5 తరగతి గదులు, తాగునీటి వసతి, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇంకా 10 శాతం పెయింటింగ్, మైనర్ రిపేరీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం అమలు చేసి నవరత్నాలు సంక్షేమ పథకాలు పేదలజీవితాల్లో వెలుగులు నింపాయి. దుద్ది సచివాలయం పరిధిలోని కొల్మాన్‌పేట, దుద్ది గ్రామాల డీబీటీ ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.16,57,56,096, నానా డీబీటీ (పరోక్షంగా) రూ.13,51,94,943 మంజూరు కాగా మొత్తం రూ.30,09,51,039 పేదలకు ఖర్చు పెట్టాడు. ఇందులో అమ్మ ఒడి కింద 606 మంది రూ.రూ.2.86కోట్లు, రైతు భరోసా 578 మందికి రూ.2,76 కోట్లు, ఉచిత పంటల బీమా 555 మందికి రూ.98,60 లక్షలు, సున్నా వడ్డీ రుణాలు 152 మందికి రూ.3.89 లక్షలు, పెన్షన్ కానుక 446 మందికి రూ.1.33 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద 276 మందికి రూ.1.27 కోట్లు, వైఎస్సార్ ఆసరా 564 మందికి రూ.1.13 కోట్లు, హౌసింగ్ నిర్మాణాలు 117 మందికి 1.47 కోట్లు, ఇవే కాక విద్యా దీవెన, వసతి దీవెన విద్యాకానుకలు, కంటి వెలుగు, సంపూర్ణ పోషణ కింద కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పేదల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిచ్చారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొండ ప్రాంతానికి వేసిన రోడ్డు

పాలన బాగుంది



జగనన్న పాలన చాల బాగుంది. నిరుపేదల కోసం ఆయన చేస్తున్న పనులు మరిచి పోలేనివి. గ్రామంలో పాఠశాలను బాగా చేశారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇస్తున్నారు. ఊళ్లోనే ఏప నులు కావాలన్నా జరిగి పోతున్నాయి. గతంలో ప్రతి సారి కోసిగికు వెళ్లి వాళ్లని వీళ్లని అడుక్కుంటూ ఇబ్బందులు పడేవాళ్లం. ఏమి కావాలన్నా వలంటీరును అడిగితే చాలు. పనులు అయిపోతున్నాయి. చాల సంతోషంగా ఉంది. జగనే పరిపాలనే మళ్లీ రావాలి. – నాగమ్మ , దుద్ది

అన్ని సేవలు గ్రామంలో అందుతున్నాయి



మా గ్రామంలోనే రైతు భరోసా, సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. దీంతో పైసా ఖర్చు లేకుండా గ్రామంలోనే పనులు అయిపోతున్నాయి. మండల స్థాయి అధికారులు కూడా ఇక్కడికే వస్తున్నారు. గ్రామంలోనే విత్తనాలు కొనుగోలు చేస్తున్నాం. ఎరువులు, పనిముట్లు దొరుకుతున్నాయి. ఇలాంటి పరిపాలన ఎన్నడూ చూడలేదు. – రామలింగ, దుద్ది

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



మా గ్రామం పై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేశారు. రూ.కోటి పైగా నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్డు వాడవాడలా ఏర్పాటు చేశారు. కొండ ప్రాంతానికి రోడ్డు వేయించి గ్రామ ప్రజల కల నెరవేర్చారు. అలాగే సచివాలయ వవస్థ, గ్రామ వలంటీర్లు సేవలు చాల బాగున్నాయి. ఉన్న ఊళ్లోనే ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. మా గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – నాగేష్, దుద్ది

టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని 16వ వార్డు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన 25 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువనేత జయ మనోజ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం స్థానిక సచివాలయంలో టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఆ వార్డు కన్వీనర్ వై.పి.గంగాధర్, కుంకనూరు వీరేష్, ఉసేని, బసవరాజ్, గంగప్ప లబ్ధిదారులకు పత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ తమ వార్డులో ప్రస్తుతానికి 25 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసినట్లు తెలిపారు. త్వరలో మంజూరైన లబ్ధిదారులందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పత్రాలను అందజేస్తామని చెప్పారు. లబ్ధిదారులు టిడ్కో గృహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన మండల విద్యాధికారి–1 రాజేంద్ర ప్రసాద్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ సంపాదిత సెలవులను నగదుగా మార్చుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ నాడు- నేడు ఫేజ్–1లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులకు నగదు రహిత సంపాదిత సెలవులను సర్వీస్ రిజిస్టర్‌లో ఎంటర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామకృష్ణ, సత్యన్న, అబ్దుల్‌నబి, సూర్యుడు, ఈరప్ప, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తోందని, ఇందుకు అనుగుణంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25లో 3.7 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ స్థానంలో పచ్చిరొట్ట ఎరువులు, బయోఫర్టిలైజర్, ఇతర సేంద్రియ ఎరువులను వినియోగించే విధంగా చూడాలని సూచించారు. రైతుల్లోకి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 21న పీఎం కిసాన్ 16వ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదలయ్యే అవకాశం ఉందని, ఆ లోపు పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ చేయించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు నుంచి జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, బాలవర్ధిరాజు, సునీత, మహమ్మద్ ఖాద్రి, అగ్రానమీ ఏడీఏ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ సూర్య రథం విరాళం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి రూ.3 లక్షల విలువజేసే పంచలోహ రథాన్ని రామలింగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి విరాళంగా అందజేశానపి ఈఓ చంద్రశేఖరరెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకొని స్వామి వారిని ఊరేగించేందుకు సూర్యరథ ప్రభను అందజేయడం సంతోషకరమన్నారు. దాతల కుటుంబ సభ్యులు, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, మాజీ సర్పంచ్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

17న దక్షిణాది రాష్ట్రాల విద్యా సదస్సు

కర్నూలు సిటీ: నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల విద్యా సదస్సు నిర్వహించనున్నటు ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో ఆ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన జాతీయ విద్యా విధానం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ విద్య విధానానికై చెన్నైలో సదస్సు నిర్వహించనున్నామన్నారు. విద్యావేత్తలు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

23 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 23, 24 తేదీల్లో నంద్యాల పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో 52వ రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి, సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు లీగ్-కమ్-నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీలో జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

18న సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 18వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్స్ బాలబాలికలకు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయోపరిమితి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో హాజరుకావాలని పేర్కొన్నారు. సబ్ జూనియర్ క్రీడాకారులు 1 జనవరి 2009 తరువాత, జూనియర్ క్రీడాకారులు జనవరి 2004 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 25వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో నిర్వహించనున్న సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 94402 57242 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న గ్రామ ఇన్‌చార్జ్ గురునాథ రెడ్డి

కౌతాళం : గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని బాపురం గ్రామ సర్పంచ్ శిల్ప, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ గురునాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాపురం గ్రామంలో రూ.40లక్షలతో సీసీ రోడ్డులు, డ్రైనేజీ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న ధ్యేయంతో గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామానికి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన రూ.40లక్షల నిధులతో ఈ పనులు చేపట్టడుతున్నట్లు వెల్లడించారు. గ్రామంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇటీవల రూ.40లక్షలతో సచివాలయం నిర్మాణాన్ని ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో జయపాల్, అయ్యప్ప రెడ్డి, శ్రీనివాస రెడ్డి రాఘవరెడ్డి, నరసప్ప, రమేష్ పలువురు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని సెంట్రల్: అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీ ఎస్ఐ గోపాల్ హెచ్చరించారు. గురువారం ఉదయం ఆదోనికి చెందిన బోయ కుమార్, బోయశంకర్ రెండు లగేజీ బ్యాగులను తీసుకుని కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగి ప్లాట్‌ఫాం–1పై నుంచి వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. బ్యాగుల్లో కర్ణాటక ఒరిజినల్ చాయిస్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. సదరు నిందితులు రాయచూర్‌లో ప్యాకెట్లను తక్కువ రేటుకు కనుగోలు చేసి మార్కెట్లో ఎక్కువ రేటుకు అమ్ముకునేందుకు తీసుకొట్టినట్లు తెలిపారు. మొత్తం ప్యాకెట్ల విలువ రూ.19,200 ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. తనిఖీలలో ఏపీఆర్‌పీసీ లియాఖత్, రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ సాయి, రైల్వే కానిస్టేబుల్స్ హుసేన్, అలీ, గాదిలింగ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుంబిగనూరు సమీపంలో..

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నది ఒడ్డున నుంచి బైక్‌లపై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు తుంగభద్ర ఒడ్డున కాపు కాయగా కిలోమీటర్ దూరంలో నిందితులు బైక్‌లు, అక్రమ మద్యం బాక్స్‌లు వదిలేసి పరారైనట్లు తెలిపారు. అందులో 10 బాక్స్‌లలో 960 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేశామని, నిందితులను బైక్‌ల ఆధారంగా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ నాగరాజు, మధు పాల్గొన్నారు.



తుంబిగనూరు వద్ద పట్టుబడిన అక్రమ మద్యం, బైక్‌లతో సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ

నేడు రవాణా రంగ సమ్మె

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో రవాణా రంగాన్ని కుదేలు చేయడానికి పూనుకున్న నేపథ్యంలో శుక్రవారం చేపట్టనున్న దేశవ్యాప్త రవాణా రంగ సమ్మెను విజయవంతం చేయాలని హైర్ బస్ డ్రైవర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం బళ్లారి చౌరస్తాలో సమ్మె జయప్రదం కోసం హైర్ బస్ కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైళ్లకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాల్సి ఉందన్నారు. లేదంటే భవిష్యత్‌లో రవాణా రంగం మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో దేశవాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ సమ్మెలో రవాణా రంగానికి చెందిన ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- చేనేతలకు 'నేతన్న నేస్తం' కింద ఏటా రూ.24 వేలు
- ఐదు విడతల్లో 6,794 మందికి రూ.16.30 కోట్ల లబ్ధి
- ఆనందంలో చేనేత కుటుంబాలు

మగ్గం.. చిద్విలాసం

ఐదేళ్ల క్రితం వరకు మగ్గాలు ముట్టుకోవడానికి కూడా చేనేతలు జంకేవారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేత పనులు మానుకొని కూలీ పనులు వెతుక్కోసాగారు. కొందరు మగ్గం గుంతలు కూడా పూడ్చివేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక నేతన్న చేయిపట్టి నడిపించేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం పేరుతో ఆర్థికంగా ఆదుకున్నారు. ఏటా రూ.24వేల ప్రకారం ఐదు విడతులు అందజేశారు. అంతేకాకుండా ఆధునిక సాంకేతికత వినియోగించుకునేలా నూతన యంత్రాలను అందజేశారు. దీంతో మగ్గం చిద్విలాసం చిందిస్తుండగా.. చేనేతపురిలో మగ్గం సవ్వడులు వేగమందుకున్నాయి.

ఎమ్మిగనూరుటౌన్: సన్నని దారం...చక్కని పనితనం.. చూపరులను ఆకట్టుకొనే వర్ణం.అందంతో పాటు హాయినిచ్చే వస్త్రం. హుందాతనాన్ని తెచ్చిపెట్టే గొప్పతనం.. వస్త్రాల తయారీలో అద్భుత కళ.. చేనేత. వినడానికి బాగేనే ఉన్నా ఈ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న చేనేత కార్మికుల బతుకులు ఐదేళ్ల క్రితం వరకు ఎంతో దుర్లభంగా మారాయి. ఇందకు నాటి ప్రభుత్వం తీరే కారణం. చేనేతపురిగా పేరుగాంచిన ఎమ్మిగనూరులో వేలాది మంది ఇదే వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. సమస్యలు ఆ రంగాన్ని చుట్టుముట్టాయని, ఎంతో ప్రఖ్యాతి గాంచిన నైపుణ్యం నిర్వీర్యమవుతుందని తెలిసినా నాటి పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎంతో మంది కార్మికులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోవడంతో మగ్గాలు నిరుపయోగంగా మారాయి. కేవలం హామీలు మాత్రమే ఇచ్చి అమలు పరవడంతోనే చేనేత రంగమే కుదేలయ్యే దుస్థితి దాపురించింది. 2019లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేతలకు జగనన్న ఆపన్న హస్తం అందించారు. వారి భవిష్యత్‌కు బంగారు బాట వేయదానికి సంకల్పించారు. అనుకున్నదే తడవుగా, ఇచ్చిన మాట నెరవేర్చడంలో భాగంగా వైఎస్సార్ నేతన్న నేస్తం పేరుతో సంక్షేమ పథకం ప్రారంభించారు.



చేనేతలకు వైడబ్ల్యూసీఎస్ ద్వారా యాంత్ర సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే

ఏటా రూ.24వేలు..

ఎన్నికల సమయంలో మగ్గం ఉన్న ప్రతి చేనేతకు ఏటా రూ.24వులు ఇచ్చి నేతపనికి ఊతం ఇచ్చి ఆదుకుంటానని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు చేనేతలు ఎక్కువగా ఉండే ఎమ్మిగనూరులో మగ్గం వున్న చేనేతలు 6,794 మంది లబ్ధిదారులుగా మారారు. వారికి ఐదు విడతల్లో రూ.16,30,56,000 లబ్ధి చేకూర్చారు. వారి బ్యాంక్ ఖాతాలో ఏటా రూ.24వేల చొప్పున ఐదు విడతలు జమచేశారు. దీంతో చేనేత కార్మికుల కుటుంబాలు నేడు ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కి ఆనందంతో ఉన్నాయి. కులవృత్తిని వదులుకొని ఇతర వృత్తుల్లో వెళ్లిన నేతన్నలు మళ్లీ తమ పూర్వపు పనిని పునరుద్ధరించుకున్నారు. అలాగే చేనేతలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రభుత్వం చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ ద్వారా ఆధునిక యంత్ర పరికరాలను సమకూర్చింది. చేనేత కార్మికులకు కూడా వివిధ రకాల సంక్షేమ పథకాలను అందజేయడంతో వారిప్పుడు సంతోషంగా గడుపుతున్నారు.

నేతన్న నేస్తంతో తొలగిన కష్టాలు



సీఎం జగనన్న ఇచ్చిన నేతన్న నేస్తంతో మా కుటుంబంలో ఆర్థిక కష్టాలు తొలగిపోయాయి. ముడి సరుకు తెచ్చుకొని మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాం. అమ్మఒడి, విద్యాదీవెన పథకాలతో నా ఇద్దరు కూమార్తెలను చదువుకుంటున్నారు. పథకాలతో మాకుటుంబం సంతోషంగా వుంది..వృత్తినే నమ్ముకొని అప్పులు చేసి నెట్టుకొస్తున్న వేళ ఆర్థికంగా ఆదుకున్నారు. – ఈరమ్మ,
చేనేత కార్మికురాలు,ఎమ్మిగనూరు

కష్టకాలంలో అండగా..



వృత్తిని నమ్ముకొని జీవించే మాకు కష్టకాలంలో వైఎస్సార్ నేతన్న నేస్తం అండగా నిలిచింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఏటా రూ.24 వేల ప్రకారం ఐదేళ్లు ఇవ్వడంతో మా కుటుంబానికి, వృత్తికి ఆర్థికంగా ఆసరా లభించింది. – విజయశంకర్,
చేనేత కార్మికుడు,ఎమ్మిగనూరు

జగనన్న మాట నిలబెట్టుకున్నాడు



ఎన్నికల ముందు ఇచ్చే హామీలు ఎక్కడ నెరవేరుస్తారు అనుకున్నాం. కానీ జగనన్న తన మాట నిలబెట్టుకొని రూ.24వేల చొప్పున ఐదు సంవత్సరాలు ఇచ్చారు. చేనేత వృత్తిని నమ్ముకొని జీవించే మాలాంటి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. – సుజాత,
చేనేత కార్మికురాలు,ఎమ్మిగనూరు